క్లుప్తంగా

కుటుంబ సర్వే పరిశీలన

మోతె : సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వేను సమర్థంగా నిర్వహించాలని సమగ్ర కుటుంబ సర్వే ఎన్యుమరేటర్ బ్లాక్ సూపర్‌వైజర్ సింహాద్రి అన్నారు. శనివారం మోతె మండలంలోని రావిపహాడ్, అప్పన్నగూడెం గ్రామాల్లో ఎన్యుమరేటర్లు చేస్తున్న ఇంటింటి కుటుంబ సర్వేను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సర్వే ప్రక్రియను వేగవంతం చేయాలన్నారు. సర్వే రిపోర్టు వివరాలు బయటి వ్యక్తులకు అందజేయడం నిషేధమన్నారు. ఎన్యుమరేటర్ మామిడి లక్ష్మి, కొత్తపల్లి మాధవి, నర్సింహారెడ్డి పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి సహకరించాలి



ప్రభుత్వ పాఠశాలకు వస్తువులు అందజేస్తున్న సత్తిబాబు

చిలుకూరు : ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి ప్రతిఒక్కరూ సహకరించాలని ఎంఈఓ గురవయ్య అన్నారు. చిలుకూరు మండలంలోని బేతవోలు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు అదే గ్రామానికి చెందిన కంచర్ల రాములు జ్ఞాపకార్థం ఆయన కుమారుడు సత్తిబాబు శనివారం రూ.15 వేలు విలువ గల మైక్, రెండు సౌండ్ బాక్స్‌లు, పోడియం అందజేశారు. ఈ సందర్భంగా దాత సత్తిబాబును ఎంఈఓ అభినందించారు. కార్యక్రమంలో ఇన్‌చార్జ్ హెచ్‌ఎం కవిత, ఉపాధ్యాయులు చందా శ్రీని వాస్‌రావు, కోటేశ్వరరావు, నరసింహారావు, వీరబాబు, వెంకన్న, ఉపేందర్, శ్రీరామ్, కృష్ణ, వెంకన్న, ప్రకాశ్, లాలు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు లక్ష్యంతో ముందుకెళ్లాలి



ధీరజ్‌రెడ్డిని సన్మానిస్తున్న ప్రగతి విద్యాలయం డైరెక్టర్ రంగారెడ్డి, తదితరులు

నేరేడుచర్ల : విద్యార్థులు ఏదైన ఒక లక్ష్యాన్ని ఎంచుకొని ముందుకు సాగాలని సివిల్ సర్వీసెస్ టాపర్ ధీరజ్‌రెడ్డి అన్నారు. శనివారం నేరేడుచర్లలోని ప్రగతి విద్యాలయంలో 'ఏకాగ్రత పెంచుట -భవిష్యత్‌లో అభ్యసించాల్సిన కోర్స్‌లు'అనే అంశంపై నిర్వహించిన అవగాహన సదస్సులో ఆయన పాల్గొని మాట్లాడారు. విద్యార్థులు పట్టుదలతో చదివి ఉన్నత శిఖరాలను అధిరోహించాలన్నారు. సమాజ సేవపై మక్కువతో తాను సివిల్ సర్వీస్‌ను ఎంచుకున్నానని తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రగతి విద్యాలయం డైరెక్టర్ కొప్పుల రంగారెడ్డి, ప్రధానోపాధ్యాయులు కొప్పుల భాస్కర్‌రెడ్డి, ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

హుజూర్‌నగర్ : పట్టణంలోని టౌన్- 1 ఫీడర్ పరిధిలో చెట్ల కొమ్మలు తొలగిస్తున్నందున దద్దనాల చెరువు కాలనీ, మల్లన్ననగర్, టీచర్స్ కాలనీ, ఎన్జీఓస్ కాలనీ, కొత్త బస్టాండ్ ఏరియా, సాయిబాబా థియేటర్ రోడ్డు, సుందరయ్య నగర్‌లో ఉదయం 8 గంటల నుంచి 11 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు విద్యుత్ ఏఈ రాంప్రసాద్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. విద్యుత్ వినియోగదారులు సహకరించాలని ఆయన కోరారు.

చిలుకూరు మండలంలో..

చిలుకూరు : మండల కేంద్రంలోని విద్యుత్ సబ్ స్టేషన్ పరిధిలో గల ఆర్‌సీ నగర్ ఫీడర్‌కు అనుసంధానంగా ఉన్న 11కేవీ విద్యుత్ లైన్‌కు అడ్డుగా ఉన్న చెట్ల కొమ్మలను తొలగించనున్నందున ఆదివారం ఉదయం 8 గంటల నుంచి 12 వరకు ఆ ఫీడర్ పరిధిలో విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు మండల ట్రాన్స్‌కో ఏఈ రాంశెట్టి శ్రీనివాస్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. విద్యుత్ వినియోగదారులు గమనించి సహకరించాలని కోరారు.

పాలకవీడు మండలంలో..

పాలకవీడు : మండల కేంద్రంతో పాటు అలింగాపురం, జాన్‌పహాడ్ గ్రామాల్లో గల 33 బై 11 కేవీ సబ్‌స్టేషన్ల పరిధిలోని వ్యవసాయ విద్యుత్ ఫీడర్లకు లైన్ క్లియరెన్స్ నిమిత్తం ఆదివారం ఉదయం 8 గంటల నుంచి 11 గంటల వరకు యల్లాపురం, రాఘవపురం, రావిపహాడ్ గ్రామాలకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ఏఈ పందిరి శ్రీనివాస్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆయా సబ్‌స్టేషన్ల పరిధిలోని వైర్లకు తగిలే చెట్ల కొమ్మలు కత్తిరించనున్నట్లు తెలిపారు.

'ఎన్యుమరేటర్లపై అధికారుల ఒత్తిడి'

గరిడేపల్లి : సమగ్ర కుటుంబ సర్వేలో ఎన్యుమరేటర్లపై రోజురోజుకు అధికారుల ఒత్తిడి ఎక్కువ అవుతుందని తెలంగాణ రాష్ట్ర ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ జిల్లా కార్యదర్శి కసిరెడ్డి బాలసైదిరెడ్డి అన్నారు. శనివారం మండల కేంద్రంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. ఎన్యుమరేటర్లకు శిక్షణ ఇచ్చిన రోజు.. ఉదయం పాఠశాల విధులు నిర్వర్తించి మధ్యాహ్నం ఒక పూట సర్వే చేయాలని చెప్పారని తెలిపారు. నాలుగు రోజులు సర్వే చేశాక రోజంతా సర్వే చేయాలని అంటున్నారని ఆయన పేర్కొన్నారు. సర్వే గడువును పొడగించాలని కాని ఉదయం నుంచి రాత్రి వరకు సర్వే చేయాలని అనడం సరైందికాదన్నారు. మండల అధ్యక్షుడు నాగేశ్వరరావు, వెంకట్‌రెడ్డి, రేణుక, కిషోర్‌బాబు, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

ఒకే గదిలో.. ఐదు తరగతులు

- శిథిలావస్థకు చేరిన ప్రాథమిక పాఠశాల
- అసంపూర్తిగా నూతన భవన నిర్మాణం
- వరండా, చెట్ల కింద పాఠాలు
- ఇబ్బందులు పడుతున్న విద్యార్థులు
- కోతుల బెడదతో భయాందోళన



వరండాలో విద్యార్థులకు పాఠాలు బోధిస్తున్న ఉపాధ్యాయురాలు



అసంపూర్తిగా పాఠశాల నూతన భవన నిర్మాణ పనులు

కోదాడరూరల్ : పేద విద్యార్థులు చదువుకునే ప్రభుత్వ బడులను బలోపేతం చేస్తున్నామని పాలకులు పదే పదే చెబుతున్నారు.. కానీ వారి మాటలు నీటి మూటలుగానే మిగిలిపోతున్నాయి. దీంతో సౌకర్యాలు లేక ఉపాధ్యాయులు, విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. ప్రభుత్వ బడుల్లో విద్యార్థుల సంఖ్య ఏటేటా తగ్గుకుంటూ వస్తోంది. అందుకు నిదర్శనమే కోదాడ మండలంలోని అల్వాలపురం ప్రాథమిక పాఠశాల.

వరండాలో పాఠాలు..

అల్వాలపురం ప్రాథమిక పాఠశాలలో 1 నుంచి 5వ తరగతి వరకు 36 మంది మాత్రమే విద్యార్థులు విద్యనభ్యసిస్తున్నారు. పాఠశాలలో రెండు భవనాలు ఉండగా ఓ భవనం పూర్తిగా శిథిలావస్థకు చేరుకుంది. దీంతో నూతన భవనం నిర్మించేందుకు నాలుగేళ్ల కిందట గత ప్రభుత్వ హయాంలో జెడ్పీ నిధులు రూ.4 లక్షలతో పనులు చేపట్టారు. కానీ పనులు స్లాబ్ వరకు చేరుకున్న తర్వాత నిధులు సరిపోవడం లేదని కాంట్రాక్టర్ ఆ పనులను మధ్యలోనే నిలిపివేశాడు. ఇక శిథిలావస్థకు చేరుకున్న భవనం కూలేందుకు సిద్ధంగా ఉండటంతో దానికి తాళం వేశారు. మిగిలిన ఒక్క గదిని ఉపాధ్యాయులు స్టాఫ్ రూంగా వినియోగించుకుంటుండడంతో పాటు ఆ గదిలో, వరండాలో 36 మంది విద్యార్థులకు పాఠాలు చెబుతున్నారు.



శిథిలావస్థలో పాఠశాల పాత భవనం



పాఠశాల ప్రహరీపై తిరుగుతున్న కోతులు

కోతుల బెడదతో భయాందోళన

ప్రస్తుతం ఉన్న ఒక్క గదిలో 36 మంది విద్యార్థులకు పాఠాలు చెప్పేందుకు ఉపాధ్యాయులు ఇబ్బంది పడుతున్నారు. ఉపాధ్యాయులు గదిలో చెప్పే పాఠాలు వరండాలో విద్యార్థులకు.. వరండాలో చెప్పే పాఠాలు గదిలో ఉన్న ఉపాధ్యాయులు, విద్యార్థులకు వినపడి పిల్ల లు ఏకగ్రతను కోల్పోతున్నారు. ఆరు బటయ చెట్ల కింద గాని అసంపూర్తిగా ఉన్న భవనంలో పాఠాలు చెబుతామంటే కోతుల బెడద ఎక్కువగా ఉందని ఉపాధ్యాయులు చెబుతున్నారు. మధ్యాహ్న భోజన సమయంలో కూడా కోతులు వస్తుండటంతో విద్యార్థులు తినేంత వరకు ఉపాధ్యాయులు, స్థానికులు కాపాలాగా ఉండాల్సి వస్తుందని అంటున్నారు.

పక్కన చెప్పే పాఠాలు వినబడుతున్నాయి



మాకు సరిపడ తరగతి గదులు లేవు. ఉన్న ఒక్క గదితో పాటు వరండాల్లో టీచర్లు మాకు పాఠాలు చెబుతున్నారు. దీంతో మాకు పక్కన టీచర్లు చెప్పే పాఠాలు వినబడుతుండటంతో ఏకగ్రతనును కోల్పోతున్నాం. నూతన భవనం నిర్మించి మా సమస్యను తీర్చాలి.

– కె.నందిని, 5వ తరగతి

కోతులు వస్తున్నాయి



మా టీచర్లు ఎప్పుడైన వరండా, అసంపూర్తిగా ఉన్న భవనంలో, చెట్ల కింద పాఠాలు చెప్పంటే కోతులు వస్తున్నాయి. కోతులు అరుసుకుంటు మీదకు దాడి చేయడానికి వచ్చినట్లు చేస్తూ మమ్మల్ని బయపెడుతున్నాయి.

– నిఖిత, 4వ తరగతి

అధికారుల దృష్టికి తీసుకెళ్తా



అల్వాలపురం ప్రాథమిక పాఠశాల నూతన భవన నిర్మాణ పనులు మధ్యలో నిలిచిపోయిన మాట వాస్తవామే. సమస్యను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి సాధ్యమైనంత త్వరగా పరిష్కరించేందుకు కృషి చేస్తా.

– ఎండి.సలీం షరీఫ్, ఎంఈఓ, కోదాడ

రైతులను ఇబ్బందులు పెడుతున్న ప్రభుత్వం

- మాజీ ఎమ్మెల్యే బొల్లం మల్లయ్యయాదవ్



కొనుగోలు కేంద్రంలో ధాన్యాన్ని పరిశీలిస్తున్న బొల్లం మల్లయ్యయాదవ్

కోదాడరూరల్ : కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం సేకరించకుండా కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం రైతులను ఇబ్బందులు పెడుతోందని మాజీ ఎమ్మెల్యే బొల్లం మల్లయ్యయాదవ్ ఆరోపించారు. శనివారం కోదాడ మండలం ఎర్రవంలో పీఏసీఎస్ ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని పరిశీలించి రైతులతో మాట్లాడి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీ ప్రజాప్రతినిధులు హడావుడిగా కొనుగోలు కేంద్రాలను ప్రారంభించి 15 రోజులు గడుస్తున్నా ఎక్కడ కూడా బస్తా ధాన్యం కాంటా వేయకుండా పరోక్షంగా మిల్లర్లకు సహకరిస్తున్నారని పేర్కొన్నారు. కొనుగోలు కేంద్రాల్లో సరైన సౌకర్యాలు లేవని, టార్పాలిన్లు, బస్తాలు లేవని , మిల్లుల కేటాయింపు కూడా చేయకపోవడం సిగ్గుచేటన్నారు. సీఎం, మంత్రులు, ఎమ్మెల్యేలు రైతుల సమస్యలు పట్టించుకోకుండా విహార యాత్రలు చేస్తున్నారని ఆయన విమర్శించారు. ఇక సన్నాల పేరుతో రైతులను తీవ్ర ఆందోళనకుగురి చేస్తున్నారని ఏ సన్నాలకు మద్దతు ధర , రూ.500 బోనస్ ఇస్తారో తెలియని పరిస్థితుల్లో అధికారులు ఉన్నారన్నారు. కార్యక్రమంలో శెట్టి సురేష్, దొంగల లక్ష్మీనారాయణ, ముత్తవరపు రమేష్, బెల్లంకొండ వెంకటేశ్వర్లు, బ్రహ్మం, దొంతగానిఅప్పారావు, ఉద్దండు, వేమూరి వరదారావు, అన్నెం అంజిరెడ్డి, చంద్యా, వీరు, బోస్, జగ్గయ్య, వెంకట్‌రెడ్డి, పూర్ణయ్య, సైదులు, పాపారావు, మట్టయ్య ఉన్నారు.

పంట కోసేటప్పుడు జాగ్రత్తగా ఉండాలి



నడిగూడెంలో రైతులకు సూచనలు చేస్తున్న సీఐ రామకృష్ణారెడ్డి

నడిగూడెం : వరి పంట కోసేటప్పుడు రైతులు జాగ్రత్తగా ఉండాలని మునగాల సీఐ రామకృష్ణారెడ్డి అన్నారు. శనివారం నడిగూడెం మండల కేంద్రంలోని ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆయన పరిశీలించి మాట్లాడారు. ట్రాక్టర్లలో ధాన్యం తరలించేటప్పుడు విద్యుత్ తీగలు తగలకుండా జాగ్రత్త పడాలన్నారు. ట్రాక్టర్లలో ధాన్యం ఎత్తుగా పోయకుండా మోతాదు ప్రకారం రవాణా చేయాలన్నారు. ప్రభుత్వ ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం విక్రయించి మద్దతు ధరతో పాటు బోనస్ పొందాలని సూచించారు. కార్యక్రమంలో స్థానిక ఎస్‌ఐ జి.అజయ్‌కుమార్, రైతులు ఉన్నారు.

ఘనంగా స్వపరిపాలన దినోత్సవం



వేడుకల్లో పాల్గొన్న ఉపాధ్యాయులు, విద్యార్థులు

హుజూర్‌నగర్ : పట్టణంలోని చైతన్య హైస్కూల్‌లో శనివారం స్వపరిపాలన దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు.. కలెక్టర్, డీఈఓ, ఎంఈఓ, వివిధ శాఖల అధికారులు, ఉపాధ్యాయులుగా ఆకట్టుకున్నారు. పలువురు జాతీయ నాయకులు, వివిధ వేషధారణలో అలరించారు. ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు ఉపాధ్యాయులు బహుమతులు ప్రదానం చేశారు. కరస్పాండెంట్ మేరెడ్డి యల్లారెడ్డి, ప్రధానోపాధ్యాయుడు సారెడ్డి ప్రతాప్‌రెడ్డి, ఉపాధ్యాయులు, శరత్ ఆనంద్, హుస్సేన్ మియా, మనోహర్, గ్రామణి, రమాదేవి, విద్యార్థులు పాల్గొన్నారు.

సీపీఎం మహాసభల కరపత్రం ఆవిష్కరణ



కరపత్రం ఆవిష్కరిస్తున్న సీపీఎం నాయకులు

నేరేడుచర్ల : సూర్యాపేటలో ఈనెల 29, 30, డిసెంబర్ 1న జరిగే సీపీఎం జిల్లా 3వ మహాసభలను విజయవంతం చేయాలని సీపీఎం మండల కార్యదర్శి సిరికొండ శ్రీను కోరారు. శనివారం నేరేడుచర్ల మండలంలోని పెంచికల్‌దిన్న గ్రామంలో గల అరిబండి ఓంకార్ భవనంలో సీపీఎం మహాసభల కరపత్రం ఆవిష్కరించి మాట్లాడారు. మహాసభలకు పార్టీ నాయకులు, కార్యకర్తలు, కార్మికులు, కర్షకులు, మహిళలు, యువకులు భారీగా తరలిరావాలని కోరారు. కార్యక్రమంలో కేవీపీఎస్ జిల్లా అధ్యక్షుడు మర్రి నాగేశ్వర్‌రావు, గ్రామ శాఖ కార్యదర్శి అల్వాల శ్రీధర్, పాలకూరి రాములమ్మ, అరిబండి ప్రసాద్‌రావు, ఎల్లబోయిన గంగమ్మ, సీతారాములు, వీరయ్య, సైదులు, రామారావు, ప్రసాద్ తదితరులు ఉన్నారు.

వైభవంగా నగర సంకీర్తన

హుజూర్‌నగర్ : కార్తీక పౌర్ణమిని పురస్కరించుకుని పట్టణంలో అయ్యప్ప మాలధారులు నగర సంకీర్తనను శుక్రవారం రాత్రి వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీఅభయాంజనేయస్వామి ఆలయం నుంచి శివాలయం వరకు అయ్యప్పస్వామిని ఊరేగించారు. మహిళలు నీళ్లు ఆరబోసి, మంగళహారతులు పట్టారు. అనంతరం శివాలయంలో ప్రత్యేక పూజలు చేసి సంకీర్తన ముగించారు. స్థానిక రంగస్థల కళాకారులు వివిధ దేవతల వేషధారణలో ఆకట్టుకున్నారు. గురుస్వాములు, దీక్షా స్వాములు పండ్ల హుస్సేన్, సురేందర్, వెంకట్‌నారాయణ, బి.గిరి, బి.శ్రీను, ఇ.రవి, మంజునాథ, శ్రీను, ఎ.రామకృష్ణ, ఎకృష్ణ, పి.గురవయ్య, శ్రీను, నరసింహారావు, హరికృష్ణ, సుధాకర్, గిరి, బి.అమర్ పాల్గొన్నారు.



నగర సంకీర్తనలో పాల్గొన్న అయ్యప్పస్వాములు

నిజాయితీ చాటుకున్న 'సాక్షి' ఏజెంట్

- దొరికిన పర్సు పోలీసులకు అప్పగింత



రవికి పర్సు అందజేస్తున్న శ్రీను, ఏఎస్‌ఐ వెంకటేశ్వర్లు

చిలుకూరు : తనకు దొరికిన పర్సును పోలీసులకు అప్పగించి సాక్షి పేపర్ ఏజెంట్ కందుకూరి శ్రీను నిజాయితీ చాటుకున్నాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. చిలుకూరు గ్రామానికి చెందిన సాక్షి పేపర్ ఏజెంట్ కందుకూరి శ్రీను రోజూ మాదిరిగా మండలంలోని సీతారాంపురం గ్రామంలో శనివారం ఉదయం పేపర్ వేస్తున్న క్రమంలో గ్రామ స్టేజీ వద్ద తనకు పర్సు దొరికింది. దీంతో పర్సును చిలుకూరు పోలీస్‌స్టేషన్‌లో అప్పగించాడు. పర్సులో ఉన్న పలు కార్డుల ఆధారంగా నారాయణపురం గ్రామంలో వరికోత మిషన్ డ్రైవర్ జానోత్ రవికి చెందినదిగా పోలీసులు గుర్తించారు. పర్సులో రూ.6 వేలు నగదు, ఏటీఎం, ఆధార్‌కార్డ్, పాన్‌కార్డులను ఏఎస్‌ఐ వెంకటేశ్వర్లు సమక్షంలో రవికి.. శ్రీను అందజేశారు. ఈ సందర్భంగా పేపర్ శ్రీనును ఎస్‌ఐ సురభి రాంబాబుగౌడ్, ఏఎస్‌ఐ వెంకటేశ్వర్లు, గ్రామస్తులు అభినందించారు.

ధాన్యం కొనుగోళ్లలో అలసత్వం వహించొద్దు

- అడిషనల్ కలెక్టర్ రాంబాబు



తమ్మరలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని పరిశీలిస్తున్న అడిషనల్ కలెక్టర్ రాంబాబు

కోదాడరూరల్ : ధాన్యం కొనుగోళ్లలో అలసత్వం వహించకుండా వేగవంతం చేయాలని అడిషనల్ కలెక్టర్ రాంబాబు ఆదేశించారు. శనివారం కోదాడ పట్టణ పరిధిలోని తమ్మరబండపాలెం, బాలాజీనగర్‌లో పీఏసీఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఆయన పరిశీలించి మాట్లాడారు. నిబంధనల ప్రకారం ధాన్యాన్ని వెంటనే కాంటాలు వేసి కేటాయించిన మిల్లులకు తరలించాలని అన్నారు. మిల్లర్లు కొర్రీలు పెట్టకుండా ధాన్యాన్ని దిగుమతి చేసుకోవాలని తెలిపారు. అదేవిధంగా రైతులు నిబంధనల ప్రకారం కొనుగోలు కేంద్రాలకు ధాన్యాన్ని తీసుకొచ్చి మద్దతు ధర పొందాలన్నారు. ఆయన వెంట ఆర్డీఓ సూర్యానారాయణ, తహసీల్దార్ వాజిద్‌అలీ, డీటీసీఎస్ రాంరెడ్డి తదితరులు ఉన్నారు.

ప్రజాపాలనలో అభివృద్ధి పరుగులు



రింగ్ రోడ్డు పనులను పరిశీలిస్తున్న మున్సిపల్ పాలకవర్గం, నాయకులు

హుజూర్‌నగర్ : ప్రజాపాలనలో అభివృద్ధి పనులు పరుగులు పెడుతున్నాయని మున్సిపల్ చైర్‌పర్సన్ అర్చన రవి, వైస్ చైర్మన్ కోతి సంపత్‌రెడ్డి అన్నారు. హుజూర్‌నగర్‌లో జరుగుతున్న రింగ్ రోడ్డు పనులను శనివారం స్థానిక నాయకులతో కలిసి వారు పరిశీలించి మాట్లాడారు. 2013 లో అప్పటి మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి మొదలు పెట్టిన రింగ్ రోడ్డు పనులు తిరిగి ఆయన హయాంలోనే పూర్తి కావడం హర్షణీయమన్నారు. మిర్యాలగూడ నుంచి మట్టపల్లి, మేళ్లచెరువు వెళ్లే భారీ వాహనాలకు రేపటి నుంచి ఈ రింగ్ రోడ్డు అందుబాటులోకి వస్తుందని తెలిపారు. కార్యక్రమంలో మున్సిపల్ మాజీ చైర్మన్ దొంతగాని శ్రీనివాస్, కౌన్సిలర్లు శ్రావణ్‌కుమార్, ఎ.సతీష్, భాస్కర్, వై.విజయ్, టి.రవినాయక్, వి.కృష్ణ, బాబూరావు, సైదా, తదితరులు పాల్గొన్నారు.

వర్గీకరణకు మాదిగలంతా ఏకం కావాలి



సమావేశంలో మాట్లాడుతున్న టీఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు రవి

హుజూర్‌నగర్ : ఏబీసీడీ వర్గీకరణ కోసం మాదిగలంతా ఏకం కావాలని టీఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు పి.రవి అన్నారు. శనివారం హుజూర్‌నగర్‌లోని టౌన్ హాల్‌లో నిర్వహించిన టీఎమ్మార్పీఎస్ నియోజకవర్గ ముఖ్య నాయకుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఏబీసీడీ వర్గీకరణ కోసం నిరంతరం పోరాడతామని అన్నారు. జిల్లా వ్యాప్తంగా నిర్వహించబోయే బైక్ ర్యాలీ ఈనెల 20న మునగాల నుంచి ప్రారంభమవుతుందని తెలిపారు. హైదరాబాద్‌లో ఈనెలలో జరిగే ఎమ్మార్పీఎస్ రాష్ట్ర సదస్సుకు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని ఆయన కోరారు. కార్యక్రమంలో టీఎమ్మార్పీఎస్ నాయకులు ఆర్.విజయభాస్కర్, కె.జానయ్య, ఎం.అంబేద్కర్, పి.నారాయణ, ఎం.ముక్కంటి, వెంకటయ్య, పి.కాటమయ్య, ఆర్.రాము, కె.సైదులు, కె.రవీందర్, గురుస్వామి, శ్రీకాంత్, బాబు తదితరులు పాల్గొన్నారు.

సత్యనారాయణ సేవలు అభినందనీయం

మునగాల : మండలంలోని నర్సింహాపురంలో గల శ్రీకోదండరామస్వామి తిరుకల్యాణ మహోత్సవం సందర్భంగా శ్రీకోదండరామస్వామి సేవా సమితి, సాంస్కృతిక, సామాజిక సేవ ఆర్గనైజేషన్ వ్యవస్థాపకుడు వేమూరి సత్యనారాయణ గత 14 ఏళ్లుగా చేస్తున్న సేవలు అభినందనీయమని తిరుమల తిరుపతి దేవస్థానం బోర్డు సభ్యుడు నన్నూరి నర్సిరెడ్డి అన్నారు. శుక్రవారం గ్రామంలో జరిగిన శ్రీకోదండ రామస్వామి తిరుకల్యాణ మహోత్సవానికి ఆయన హాజరయ్యారు. ఈ సందర్భంగా వేమూరి సత్యనారాయణ ఆధ్వర్యంలో ప్రజలకు వస్త్రదానం చేసి మాట్లాడారు. అనంతరం నర్సిరెడ్డిని సత్యనారాయణ శాలువాతో సత్కరించారు. దుస్తుల దాతలు కసిరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి, నీలా సత్యనారాయణ, బుర్రా పుల్లారెడ్డి, పందిరి నాగిరెడ్డి, రంగస్థల కళాకారుడు పిచ్చయ్య, గ్రామపెద్దలు విలాసకవి రమేష్‌రాజు, శ్రీనివాసరావు, లక్ష్మయ్య, బాబు పాల్గొన్నారు.

ధాన్యం ఎక్కడ అమ్మినా బోనస్ ఇవ్వాలి

గరిడేపల్లి : ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీ ప్రకారం రైతులు ధాన్యం ఎక్కడ అమ్ముకున్నా క్వింటాకు రూ.500 బోనస్ ఇచ్చి మాట నిలబెట్టుకోవాలని సీపీఐ మండల కార్యదర్శి పోకల వెంకటేశ్వర్లు ప్రభుత్వాన్ని కోరారు. శనివారం గరిడేపల్లి మండల కేంద్రంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. రైతులకు అన్యాయం చేయటం ప్రభుత్వానికి తగదని అన్నారు. సాకులు చెప్పకుండా రైతులు పండించిన ధాన్యానికి బోనస్ ఇచ్చి ఆదుకోవాలని ప్రభుత్వాన్ని కోరారు.

మృతురాలి కుటుంబానికి ఆర్థికసాయం అందజేత



ఆర్థికసాయం అందజేస్తున్న రాజేష్

నడిగూడెం : మండలంలోని చెన్నకేశ్వాపురం గ్రామానికి చెందిన దున్నా నాగమ్మ (65) ఇటీవల అనారోగ్యంతో మృతి చెందారు. మృతురాలిది కుటుంబం నిరుపేద. దీంతో కాగితరామచంద్రాపురం సహకార సంఘం చైర్మన్, అదే గ్రామానికి చెందిన గోసుల రాజేష్ శనివారం మృతురాలి కుటుంబ సభ్యులకు ఐదు వేల రూపాయల ఆర్థిక సాయం అందజేశారు. కార్యక్రమంలో కటికల పుల్లయ్య, యల్లయ్య, వెంకన్న, పాల్గొన్నారు.

కొనుగోళ్లు వేగవంతం చేయాలని వినతి

మఠంపల్లి : ధాన్యం కొనుగోళ్లు వేగవంతం చేయాలని సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు భూక్యా పాండు నాయక్ కోరారు. ఈమేరకు శనివారం సీపీఎం నాయకులతో కలిసి మఠంపల్లి తహసీల్దార్ కార్యాలయంలో డీటీకి వినతిపత్రం అందజేశారు. ముందుగా మఠంపల్లిలోని ఐకేపీ ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వం కొనుగోలు కేంద్రాలను 20 రోజుల కిందటే ప్రారంభించినప్పటికీ కొనుగోళ్లు జరగక రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. దళారులకు క్వింటా రూ.1900 నుంచి రూ.2000 లకే అమ్ముకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం అందించే రూ.500 బోనస్ కూడా రైతులు పొందలేక పోతున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం మండల అధ్యక్షుడు జగన్ మోహన్‌రెడ్డి, సీపీఎం మండల కార్యదర్శి బాలునాయక్, నాయకులు కర్పూరపు వెంకట్‌రెడ్డి, పాడిశెట్టి రాము, రాజు, మట్టయ్య, శ్రీను పాల్గొన్నారు.

ప్రజా సమస్యలను విస్మరించిన పాలకులు



సీపీఐ సభ్యత్వాలు అందజేస్తున్న రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు రాములు, వెంకటేశ్వర్లు

హుజూర్‌నగర్ : ఒకరిపై ఒకరు విమర్శలతో కాలయాపన చేస్తూ రాష్ట్రంలో ప్రజా సమస్యలను కాంగ్రెస్ ప్రజాప్రతినిధులు, ప్రధాన ప్రతిపక్ష పార్టీ నాయకులు విస్మరించారని సీపీఐ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు యల్లావుల రాములు, సీనియర్ నాయకుడు ఎం.వెంకటేశ్వర్లు అన్నారు. శనివారం హుజూర్‌నగర్‌లో సీపీఐ సభ్యత్వ నమోదును వారు ప్రారంభించి మాట్లాడారు. అధికారులు ధాన్యం కొనుగోళ్లకు సాకులు చూపుతుంటే ప్రభుత్వం ఏం చేస్తుందని వారు ప్రశ్నించారు. నిబంధనలు సడలించి రైతులు పండించిన ప్రతి ధాన్యపు గింజను ప్రభుత్వమే కొనుగోలు చేయాలని వారు డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యురాలు దేవరం మల్లేశ్వరి, పట్టణ కార్యదర్శి గుండు వెంకటేశ్వర్లు, నాయకులు యల్లావుల రమేష్, దొంతగాని సత్యనారాయణ, జడ శ్రీను, జక్కుల రమేష్, మామిడి వెంకయ్య, మామిడి నరసయ్య, ఎస్.కె ముస్తఫా, గాంధీ పాల్గొన్నారు.

మాలధారులకు అన్నదానం



కోదాడరూరల్ : అన్నదానం నిర్వహిస్తున్న దాతలు, నిర్వాహకులు

కోదాడరూరల్ : కోదాడ పట్టణ పరిధిలోని హుజూర్‌నగర్ రోడ్డులో గల గాలి రమేష్‌నాయుడు అయ్యప్ప సన్నిధానంలో మాలధారులకు అన్నదానం కొనసాగుతోంది. శనివారం ఆరవ రోజు దాతలు చల్లా శ్రీనివాస్‌యాద్- లక్ష్మి దంపతులు 550 మంది మాలధారులకు అన్నదానం ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో డాక్టర్ నిఖిలేష్, అఖిలేష్, నిర్వాహకులు గాలి శ్రీనివాస్‌నాయుడు, గడ్డం సూర్యారెడ్డి ఉన్నారు.

కల్లూరులో..

నేరేడుచర్ల : కార్తీక మాసం సందర్భంగా నేరేడుచర్ల మండలంలోని కల్లూరు గ్రామంలో అయ్యప్ప మాలధారులకు జనసేన పార్టీ హుజూర్‌నగర్ నియోజకవర్గ ఇన్‌చార్జ్ సరికొప్పుల నాగేశ్వర్‌రావు ఆధ్వర్యంలో శనివారం అన్నదానం నిర్వహించారు. కార్యక్రమంలో అయ్యప్ప మాలధారులు అంజి, భిక్షం, నాగరాజు, మట్టయ్య, గోపి, వీరస్వామి తదితరులు పాల్గొన్నారు.

కొనుగోలు కేంద్రాల్లోనే ధాన్యం విక్రయించాలి



మొద్దులచెరువు స్టేజీ వద్ద కొనుగోలు కేంద్రంలో తేమ శాతాన్ని పరిశీలిస్తున్న ఏడీఏ ఎల్లయ్య

మునగాల : రైతులు ధాన్యాన్ని ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల్లో విక్రయించి మద్దతు ధర పొందాలని వ్యవసాయ శాఖ కోదాడ డివిజన్ సహాయ సంచాలకులు డి.ఎల్లయ్య కోరారు. శనివారం మండలంలోని మొద్దులచెరువు స్టేజీ వద్ద ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాన్ని ఆయన పరిశీలించి మాట్లాడారు. ధాన్యం క్వింటాల్‌కు ప్రభుత్వం రూ.2320 మద్దతు ధరతో పాటు రూ.500 బోనస్ ఇస్తున్నట్లు తెలిపారు. రైతులు ధాన్యాన్ని తాలు, తేమ లేకుండా ఆరబెట్టి కొనుగోలు కేంద్రాలకు తీసుకురావాలని సూచించారు. ఆయన వెంట ఎంపీడీఓ కె.రమేష్‌దీనదయాళ్, ఏఓ బుంగా రాజు, సహకార సంఘం సిబ్బంది కోటయ్య, రైతులు ఉన్నారు.

వైభవోపేతం.. నారసింహుని కల్యాణం

మఠంపల్లి : మట్టపల్లి శ్రీలక్ష్మీనరసింహస్వామి క్షేత్రంలో శ్రీరాజ్యలక్ష్మి చెంచులక్ష్మి సమేత శ్రీ ప్రహ్లాద యోగానంద శ్రీలక్ష్మీనరసింహస్వామి నిత్యకల్యాణాన్ని అర్చకులు శనివారం వైభవోపేతంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయంలో సుప్రభాత సేవ, నిత్యహోమం, మూలవిరాట్ స్వామికి పంచసూక్త విధానంగా పంచామృతాభిషేకం, ప్రత్యేక అర్చనలు చేశారు. అనంతరం స్వామివారిని, అమ్మవార్లను నూతన పట్టు వస్త్రాలతో అందంగా అలంకరించి ఎదుర్కోళ్ల మహోత్సవ సంవాదం రక్తికట్టించారు. కల్యాణ తంతులో భాగంగా విష్వక్సేనారాధన, పుణ్యాహవచనం, రుత్విగ్వరణం, రక్షాబంధనం, మధుపర్కపూజ, మాంగల్యధారణ నిర్వహించారు. అనంతరం స్వామి అమ్మవార్లను గరుడ వాహనంపై ఆలయ తిరుమాడ వీధుల్లో ఊరేగింపు నిర్వహించారు. భక్తులకు తీర్థ ప్రసాదాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఆలయ అనువంశిక ధర్మకర్తలు చెన్నూరు విజయ్‌కుమార్, మట్టపల్లిరావు, ఈఓ నవీన్‌కుమార్, అర్చకులు రామాచార్యులు, పద్మనాభాచార్యులు, లక్ష్మీనరసింహమూర్తి, ఫణిభూషణ మంగాచార్యులు, ఆంజనేయాచార్యులు, భక్తులు పాల్గొన్నారు.



మట్టపల్లిలో కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు